# ఆమె దుఃఖం

[కథానిక]

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

చిన్న తిరపతిప్రదేశం సుక్షేత్రం కాదనడానికి అవకాశాలు లేవు. మెరక దేశం, అడివి దేశంమాట నిజమే! పల్లపుటూళ్లు మాత్రం మొదట్లో అడవులు కావూ! మానవుడు చేరకపూర్వం ప్రకృతి అంతే!

తిరపతికి మూడుమైళ్లు ఉత్తరంగా చిన్నపల్లె ఉంది. బస్సురోడ్డుకి రెండుమైళ్ల దూరుడులో ఉంది ఆగ్రామం. ఊరిదగ్గరికి వెళ్లేవరకూ ఊరుందని తెలియదుగాని తిరపతిలో మల్లేశ్వరస్వామికొండెక్కి చూస్తేమట్టుకు అక్కడ ఒక ఊరంటూ ఉందని తేలుతుంది. మొదట పంటచెరువు, దానికింద చేలు, దానికి వెనక తాడిచెట్లు, అడివిచెట్లగుంపు అతి రమణీయంగా కనబడతాయి. ఆచెట్లగుంపే చిన్నపల్లి.

రోడ్డుదగ్గిరనుంచి అడివిలాంటి పుంతలో పడి, పిడచరాళ్లు తన్నుకుంటూ, ఎర్రబొండు ఇసకలో కాళ్లు లాక్కొని, ఎక్కడేనా నీళ్లు నిలిచిఉంటే దాటిపోగా, చిన్నపల్లి చేరతాం. ఊరంతా ఎంత ఉంది! వందగడప. అందులో పాతఊరు వేరు, కొత్తఊరు వేరు. రెండిటికీ మధ్య చిన్న ఊరచెరువు, దానితాలూకు వాగు ఉన్నాయి. పాతఊరు బొత్తిగా చాలకపోతే ఎలాగో సాహసించి కొత్తఊరు కట్టుకున్నారు. ఏదయినా చుట్టిళ్లు, పాకలుగాని పెంకుటిల్లు పేరుకేనా లేదు. పాతఊళ్లో ఇళ్లు కొన్ని ఒక్కగుత్తిగా ఉన్నాయి, సీమటపాకాయిల్లాగ. వేసవిలో ఏదేనా ఒకటి అంటుకుంటే ఆ గుత్తిగుత్తీ ఉత్తదే. వెధవతాటాకు ఇళ్లు చూరుచూరు అంటుకునేలాగు కట్టుకోడం ఎందుకో!

ఈగుత్తిలో రెండుసందులు, ఒక గొంది ఉన్నాయి. వాటినే అడివిదారులనికూడా అనవచ్చు. ప్రతిఇంటిముందున్న దడీ కలిసి దారికి ఇటు అటు గోడలా గుంటాయి. దానిమీద ఎక్కని అడివితీగ లేదు. ఎక్కడో అడవిలో పెరిగే దుష్టుపుతీగె, తిప్పతీగె, ఆర దొండ, ఉచ్చింత—ఒకటేమిటి, సమస్తమూ అక్కడే. చేదుకాకరసంగతి చెప్ప నక్కరలేదు. అవి దళ్లు కావు, పచ్చనిగోడలు. దగ్గిరికివెళితే ఏ పాముపొడుస్తుందో! ఆపెడలకంపదళ్లకి రాటలు సీతాఫలపుచెట్లు. పొలంకట్టవల నిండా ఉండే సీతాఫలపుచెట్లు ఇక్కడకూడా ఎందుకో! మనం చెప్పినా ఒప్పించలేం. ఇక్కడ కాసిన కాయలతోనే కడుపునిండాలిట. మళ్లాచూస్తే కాసీకి గంపెడుకాయలు. దరిద్రానికి తోడు జ్ఞానదారిద్ర్యం. మంచి వర్షాకాలంలో దళ్లమీది తీగెలు, రాటలుకూడా బాగా పచ్చపడి 'జుం' అంటూ ఉంటాయి. కత్తెరపురుగు 'కిర్ కిర్'లతో ఇది ఊరా, అడివా అనిపిస్తుంది.

ఇంటికీ ఇంటికీ మధ్య వాడుకోని స్థలముంటే ప్రకృతి వాడుకోకతప్పదు. జిల్లేడో, కసిందో, వెంపలో, అవీకాకపోతే ఎప్పుడూ

సిద్ధంగా ఉండే ముత్తవపులగమో తయారు. ఎక్కడ పడ్డ గింజ అక్కడ మొలవవలసిందే! అదీ విచిత్రం.

కొత్త ఊరికి వెళ్లే పుంతలో మధ్యనే తాడిచెట్లు పెరిగాయి. తస్సాగొయ్యా, బండీ వెళితే సరి హాడలకొట్టేస్తాయి. అయినా ఆ ఇరుకులోంచి రోజూ బళ్లు వెళుతూనే ఉంటాయి. దారిమధ్య తాడిచెట్లెందుకూ అని ఎవరేనా అడిగితే "వాటిని కొట్టడానికి మట్టుకు సర్కారువారు ఒప్పుకోవద్దూ" అంటారు—సర్కారువారంటే అవస్థపడడమన్నట్టు. ఇంతకీ అవి చెట్లయేదాకా ఎలాగ పెరిగాయి!

సత్తెం ఇల్లు ఊరికి ఉత్తరాన్న చివర ఉంది. కొత్తఊళ్లో చివరి ఇల్లన్నమాట. కొత్తఊళ్లో ఇళ్లన్నింటికీ పాతఊళ్లో ఇళ్లలాగ గాక దొడ్లు ఉన్నాయి. పాత ఊళ్లో ప్రతిఇంటికీ ఉన్న బెత్తెడుజాగాలోనే పెంటగొయ్యి ఉంటుంది. సీతాఫలపు చెట్ల నీడలో ఆ గోతిరోత చెప్పలేము. అక్కడే తేగలపాతర! ఇంత బాధ కొత్త ఊరికి లేదు. పెద్ద పెరళ్లవల్ల గొడ్లపెంట, చివికిన తాటాకులు, కంకెళ్లు ఇంటికి కాస్తదూరంగా పోసుకోవచ్చు. పెరడు ఊరికే పోనియ్యడ మెందుకని ఏ చోళ్లో, జొన్నో, మొక్కజొన్నో, ఆముదాలో ఆయా కార్తులలో జల్లుతారు. ఇంట్లో చేను, చేనిలో ఇల్లు— ఇదో అవస్థ.

పాత ఊరు విడిచిపెట్టి కొత్త ఊరు చేరిన సత్తెం సొంత స్థలంలో పాక వేసుకున్నాడు. పాకచూరునుంచి సాకట్లో వాన నీరు పడకుండా తాటిదొన్నె ఎత్తికట్టాడు. పెరట్లో జొన్నజాడు పెరుగుతూంది. దాని కట్టవలో మామ్మూలు పెడలకంప, సీతాఫలపుచెట్లు. పక్కని పుంతలో ఉన్న బొమ్మజెముడుకట్టవ రాక్షసిలాగ పెరిగింది. ఈఏడు ఇంకా వానలేక ఇలాగుంది కాని వానలే ఉంటే చెప్పే దేమిటి!

సత్తెంపెళ్లాం మంగమ్మ సావిడి తుడిచి పొలంనుంచి తెచ్చిన గుత్తివేరుసెనగ రెండోరోజు ఆరపోసింది. ఇంట్లోకి వెళ్లి వంటప్రయత్నం చేస్తూ ఇవతలికి వచ్చింది. పచ్చడిబండలాగ ఉన్న నల్లపొడని చూసి కేకలు పెట్టింది. పక్కఇంటి వెంకన్న వచ్చి కర్రతో కొట్టి అవతల పారేశాడు. వదిలిపోయింది.

ఇంట్లో అటకమీద అన్ని వస్తువులూ పెట్టుకున్నారు. అప్పటికి అవసరంలేని గొర్రు, గొంటుగ, నూజల్లెడ, ముట్టెల బుట్టలు, తాటిపేళంపలుగుడు, ఆనపకాయి బుర్రలు, గుమ్మలు, తట్టలు, ఇంట్లో వేసుకున్న ఈతాకుచాపలు, ఇంకా ఏవేవో ఉన్నాయి. ఎనిమిదేళ్ల కొడుకు ఇంట్లోకి వద్దామని గడప దాటబోతూ పైనుంచి పడ్డ కాట్రేడు పొడని చూసి "అమ్మా! పామేవ్!" అని కేకలు పెట్టాడు. లోపల ఉన్న మంగమ్మ "అమ్మోయ్!" అని చేతిలో అబక కిందపారేసి పాలఉట్టి పట్టుకుని వేళ్లాడింది. పాముని జాగ్రత్తగా చూసింది. కాట్రేడు పొడ నెమ్మదిగా కదులుతూంది. గోడదగ్గిర చట్టిలో దూరి దాక్కుంది. మంగమ్మ గబుక్కున కాళ్లు నేలమీద పెట్టి చట్టిమీద కుండ మూతవేసేసింది. ఈ గడబిడ చూసి దారిని పోతూన్న ఆదెయ్య లోపలికి వచ్చి, కుండతో చట్టి అవతలకి తీసుకువెళ్లి పాముని చంపి పారేశాడు. కళ్లనీళ్లు గుక్కుకుంటూన్న మంగమ్మని చూసి ఆదెయ్య "ఏదో ఉంటాయి

మరి. రాజుగారి కోటా ఏంటి ఉండకపోడానికి? అడివిలో ఉన్నాక ఇవేంటి ఇంకా ఉంటాయి" అని ఓదార్చాడు. మంగమ్మ కళ్లొత్తుకుని ఊరుకుంది.

పెరట్లో జొన్నజాడుపక్కని పబ్బలు నాటి ఆనపతీగె ఎక్కించారు. ఊరికే ఇంట్లోకి వస్తూన్న పొరుగింటి సూరమ్మ కంటపడింది, "పాము బాబోయ్" అంది. మంగమ్మగుండెలు ఆగిపోయాయి. కొయ్యలాగ నిలబడిపోయింది. ఆవిడకొడుకు పక్క ఇంటికి వెళ్లి మొగాళ్లని పిలుచుకువచ్చాడు. రక్తపింజరిని చంపి పారేశారు. మంగమ్మకి ఒక్కమాటుగా దుఃఖం ఉబికింది. అరగంటసేపు రాగాలు పెట్టింది. రెండుగంటల్లో మూడుపాములా! ఇరుగుపొరుగువాళ్లు వచ్చారు. "అడివిలో ఉండకేంటమ్మా!" అని ఒకరు, "పాములు కొత్తా" అని మరొకరు, "తాసు కాకపోతే సరి" అని ఎంకి, "వెధవపాములు, మన నేంచేస్తా" యని బుల్లెమ్మ. ఇలాగ ధైర్యం చెప్పబోయారు కాని ఎవ రేమన్నా పాములభయం పాములభయమే! మంగమ్మ ఏడ్చిఏడ్చి ఊరుకుంది. ఆమె ఇదివరకు ముగ్గురుపిల్లలు పోయినప్పుడు ఇలాగ ఏడ్చింది.

మంగమ్మ పగలంతా మబ్బుపట్టిన రోజులాగ ఉంది. ఆమె మొహాన్ని నవ్వుకళ లేదు, ధైర్యం లేదు. ఏదో గాబరా! ఏది చూసినా బెదురే! తాడుముక్కలాగ ఏదున్నా మొదట పామే అనుకుంటూంది. ఆమెముగ్గురిపిల్లలు కంటి ఎదుట తిరుగుతున్నారు. మొదటివాడు చలిజ్వరం వచ్చి పోయాడు. తర్వాత ఇద్దరూ ఏదో విషజ్వరాలొచ్చి పోయారు. వాళ్లు తలపుకి వచ్చారు. మిగిలిన ఒక్కకొడుకుని భగవంతుడు దక్కించడా అనే ఆలోచనలు పోతున్నాయి. కాని ఆమె పీకలాలోచనల్ని తరుముతూంది. అయినా మనస్సుని విచారమేఘం కమ్మేసింది. నోటితో చెప్పుకోలేని అవస్థ అనుభవిస్తూంది. ఇంటిపనులు తప్పని సరిగా, భారంగా చేసుకుంటూంది. పాముల భయం పుట్టేక ఇల్లంతా శుభ్రంగా సర్దుకుందామని సావిట్లో ఉన్న గీతనార, నులకనార మంచాలు, కుందు, తిరగలి, రోకలి, బోరించాప సర్ది, ఆకురాల్పునువ్వుల, కొట్టుడునువ్వుల గంపలు నేలమీంచి ఎత్తి మంచం మీదపెట్టి, నేలమీద ఆరబోసిన వేరుసెనగ గుమ్మిలోకి ఎత్తుతూంది. ఎత్తేముందు ఒకబిటికి కొలుద్దామనుకుంది. కర్రకుంచం తేవడానికని లేచింది. పాకపక్కనే ఉన్న కోళ్లగూటిలోంచి తివాసీపొడ ఇవతలికి వస్తూంది. బారెడుంది, చింతకొమ్మ పడేసినట్టు. మంగమ్మ తల గిర్రున తిరిగిపోయింది. చాపచుట్టుగా పడిపోబోయింది కాని ఎలాగో నిభాయించుకుంది. కష్టంమీద మంచం ఎక్కి నిలుచుంది. రెప్పవాల్చకుండా గాజువారిన కళ్లతో చూస్తూంది. కేకలువేద్దామని తోచేలేదు. భయంతో నిలుచుంది' తివాసీపొడ కోళ్లగూటి పక్కనున్న మెట్లసెమ్మాని మూజుంచి, అక్కడే నేలమీద పెట్టిఉన్న కేరిజాపిట్టపంజరం దగ్గరికి వచ్చింది. పిట్ట రెక్కలు విప్పి తుపానుగాలికి ఆకులాగ అల్లల్లాడిపోయింది. ఒక్కటే వెర్రికూత. దాని అల్లరికి పంజరం బోర్లాపడింది. అదేమీ సాధ్యం కాకపోగా పొడ నెమ్మదిగా ఒళ్లు ఈడ్చుకుంటూ నల్లతీగె కావిడిమట్ల లోంచి సరదాకి దూరినట్టు దూరి, పబ్బల లోంచి జాడులోకి దాటిపోయింది. కొంతసేపటికి మంగమ్మకి చైతన్యం వచ్చింది. కాళ్లు గజగజ వణికిపోయాయి. మొహం పాలిపోయింది.

ఆమె మంచందిగి కుప్పకూలిపోయింది. మరి కొంత సేపటికి తెప్పరిలి ఒకటే ఏడుపు. ఆ ఏడుపు చూసి ఊళ్లోవాళ్లంతా పోగయారు. కారణ మేమిటో ఎవరికీ తెలియదు. కొంత సేపటికి ఏడుపులోనే తివాసీపొడని చూసినట్టు తేలింది. ఎటు పోయిం దనగా జొన్న జాడులోకి పోయిందని కూడా తేలి కొందరు వెతకబోయారు. ఆమెదుఃఖం అంతు లేకుండా ఉంది. తనకి కలిగిన సంతానంలో ముగ్గురు గతించారు. నిలిచినవా డొక్కడు. ఈ ఒక్కణ్ణీ కూడా భగవంతుడు దయదలిచేటట్లా కనబడలేదనీ, తన కడుపున పుట్టిన వాణ్ణి కళ్ల చూసుకునే అదృష్టం తనకి లేదేమో అనీ వెక్కి వెక్కి ఏడ్చింది. తల్లి ఏడుపు చూసి కొడుకుకూడా మొదలెట్టాడు. ఊళ్లో వాళ్లు "నువ్వు ఏడుస్తే బేలయిపోయి కుర్రాడుకూడా ఏడుస్తున్నాడు, ఊరుకో" మని ఓదార్చబోయారు. కాని ఆమె దుఃఖానికి దరి కనబడలేదు. ఎంత వెతికినా పామూ కనబడలేదు.

